క్లుప్తంగా

బహిరంగ వేలం



బహిరంగ వేలం నిర్వహిస్తున్న అధికారులు

జమ్మికుంట: జమ్మికుంట వ్యవసాయ మార్కెట్‌లో నిరుపయోగంగా ఉన్న ఇనుము, సిమెంట్‌కు సంబంధించిన స్క్రాప్‌ను మార్కెట్ అధికారుల ఆధ్వర్యంలో బుధవారం బహిరంగ వేలం నిర్వహించారు. ఈసందర్భంగా వరంగల్, హైదరాబాద్, హుజూరాబాద్, లక్షెట్టిపేట్, నిజామాబాద్‌కు చెందిన వ్యాపారులు 35మంది పాల్గొన్నారు. స్క్రాప్ కిలోకు రూ.79 చొప్పున బహిరంగ వేలంలో పలువురు కొనుగోలు చేశారు. ఐరన్‌ను మహాలక్ష్మి ఐరన్ అగ్రో ట్రేడర్స్ యాజమాని రవీందర్‌రావు, 151 సిమెంట్ రేకులను గ్లోబల్ ట్రేడర్స్ యాజమాని అక్బర్‌షా వేలంలో దక్కించుకున్నారు. వేలంలో నిర్వహించిన ధర ప్రకారం లారీలో లోడ్ చేసి, తూకం ఆధారంగా వేలం పాట దక్కించుకున్నావారు మార్కెట్‌కు డబ్బులు చెల్లించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ జెడీ మల్లేశ్, ఈఈ సిరాజొద్దీన్, డీఈ ఎల్లేశ్, మార్కెట్ కార్యదర్శి గూగులోతు రెడ్డినాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో ప్రతిభా పరీక్షలు



ప్రశ్నాపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

జమ్మికుంట: విద్యార్థుల్లో మానసిక ఒత్తిడిని అధిగమించేందుకు ప్రతిభా పరీక్షలు మార్గదర్శకంగా ఉంటాయని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు గజ్జల శ్రీకాంత్ అన్నారు. పట్టణంలోని విద్యోదయ పాఠశాలలో ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు ప్రతిభా పరీక్షలు నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ.. విద్యార్థులు రాబోయే పది పరీక్షల్లో ఎలాంటి భయందోళనలకు గురి కాకుండా ఉండేందుకు ఉపయోగకరంగా పరీక్షలు ఉంటాయన్నారు. కేంద్ర ప్రభుత్వం దేశంలో శాస్త్రీయ విద్యా విధానం అమలు చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల సమస్యల పరిష్కారానికి ఎస్‌ఎఫ్‌ఐ నిరంతరం కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ ఆర్యన్ కౌశిక్, జిల్లా కమిటీ సభ్యులు రత్నం సురేశ్, టీచర్లు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

దళితబంధు కార్డుల పంపిణీ



కార్డులు అందిస్తున్న ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్

హుజూరాబాద్: పట్టణంలోని పలు వార్డుల్లో దళితబంధు కార్డులను బుధవారం ప్రజాప్రతినిధులు ఇంటింటికీ తిరుగుతూ పంపిణీ చేశారు. పట్టణంలో 1,624 దళిత కుటుంబాలు పథకానికి ఎంపిక కాగా 1,538 మంది లబ్ధి పొందగా 1,496 మందికి కార్డులు అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ గందె రాధిక, వైస్ చైర్ పర్సన్ కొలిపాక నిర్మల, కౌన్సిలర్లు ముక్క రమేశ్, తోట రాజేంద్రప్రసాద్, మున్సిపల్ కమిషనర్ సల్వాది సమ్మయ్య, దళితబంధు పురపాలక ఇన్‌చార్జి భుమానందం, మెప్మా డీఎంసీ శ్రీవాణి, ఏడీఎంసీ మానస, సీఆర్పీలు రమాదేవి, స్వరూప, ఆర్పీలు తదితరులు ఉన్నారు.

'మీడియాపై దాడులు పత్రికా స్వేచ్ఛకు పెనుముప్పు'

విద్యానగర్: మీడియాపై దాడులు పత్రికా స్వేచ్ఛకు పెనుముప్పు అని సీపీఐ జిల్లా కౌన్సిల్ సభ్యుడు పైడిపల్లి రాజు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం మీడియా సంస్థలపై ఫాసిస్టు ధోరణితో వ్యవహరిస్తోందని ఆరోపించారు. బీబీసీ కార్యాలయాలపై ఐటీ దాడులను సీపీఐ తీవ్రంగా ఖండిస్తోందన్నారు. మీడియా సంస్థలను భయపెట్టేందుకు, వేధింపులకు గురి చేసేందుకు ప్రభుత్వ దర్యాప్తు సంస్థలను వినియోగించడం సరికాదన్నారు. బీబీసీపై దాడులు నిలిపివేయని పక్షంలో బీజేపీ ప్రజాగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు.

పరిహారం రాదు.. పట్టింపు లేదు

- మంగపేట భూనిర్వాసితుల ఆవేదన
- చెరువు కట్టవద్దే నిరాహార దీక్ష



చెరువు కట్టవద్ద నిరాహార దీక్ష చేస్తున్న మంగపేట భూ నిర్వాసితులు

గంగాధర: నారాయణపూర్ చెరువును రిజర్వాయర్‌గా చేస్తే మునిగిపోయే భూములపై పదేండ్ల కింద సర్వే చేసిండ్రు, పరిహారం ఇస్తామంటే ఏడేండ్ల కిందట సంతకాలు చేసినం, ఐదేళ్లుగా చెరువులు నింపుతుండ్రు దీంతో మా పొలాలు నీట మునిగిపోతున్నాయి. అప్పటికి ఇప్పటికి భూముల ధరలు మూడింతలైనై కానీ ఇంత వరకు మాకు పరిహారం రాలేదు, మా గురించి పట్టించుకునేవారు కరువయ్యారని మండలంలోని మంగపేట గ్రామానికి చెందిన నారాయణపూర్ రిజర్వాయర్ భూనిర్వాసితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత వర్షాకాలంలో కురిసిన భారీ వర్షాలకు గంగాధర, నారాయణపూర్ చెరువుకట్టలకు ప్రమాదం ఏర్పడటంతో నారాయణపూర్ చెరువుకు అధికారులే గండి పెట్టగా, గంగాధర చెరువుకు గండి పడింది. ప్రస్తుతం రెండు చెరువులు నీరు లేక వెలవెలబోతున్నాయి. చెరువుకట్టల మరమ్మతుకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. ఇటీవల కాంట్రాక్టర్ గంగాధర చెరువుకట్ట మరమ్మతులు చేయడానికి వాహనాలతో రాగా మంగపేట భూ నిర్వాసితులు అడ్డుకొని వారం రోజులుగా చెరువు కట్టవద్దే టెంటు వేసుకొని నిరాహార దీక్ష చేస్తున్నారు. పరిహారం ఇచ్చేంత వరకు పనులు చేయనివ్వమని పట్టుబట్టారు.

ఏడేళ్లుగా పడిగాపులు

నారాయణపూర్ రిజర్వాయర్‌లో భూములు, బావులు, ఇండ్లు కోల్పోతున్న నిర్వాసితులు ఏడేళ్లుగా పరిహారం కోసం పడిగాపులు కాస్తున్నారు. రిజర్వాయర్ నిర్మాణం ద్వారా మంగపేట గ్రామానికి చెందిన రైతులు 86 ఎకరాల వ్యవసాయ భూమి, 30 బావులు, 10 బోరుబావులు, 11 ఇండ్లు కోల్పోతున్నారు. ఎకరాకు పది లక్షల రూపాయలు పరిహారం ఇస్తామంటే 2016 నిర్వాసితులు సంతకాలు చేశారు. ఇప్పటి వరకు పరిహారం అందలేదు. అప్పుడే పరిహారం అందిస్తే అదే ధరతో ఎక్కడైనా భూములు కొనుగోలు చేసుకునే వారమని, ఇప్పుడు భూముల ధరలు మూడింతలు మించి పోయాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



లారీలను అడ్డుకుంటున్న నిర్వాసితులు (ఫైల్)

నిర్వాసితుల్లో అనుమానం

మంగపేట భూనిర్వాసితులకు రూ.16.50 కోట్లు మంజూరయ్యాయని ఎమ్మెల్యే చెబుతుండు కానీ నమ్మకం లేదని నిర్వాసితులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. మంజూరైతే ఏడేళ్ల కింద సంతకాలు చేసి బాకు ఖాతాలు ఇచ్చినం. మంజూరైన డబ్బులు ఖాతాల్లో జమచేయాలని డిమాండ్‌చేస్తుండ్రు. ధర్నా చేస్తున్నాం, మరమ్మతు పనులు అడ్డుకుంటున్నామని డబ్బులు వచ్చినాయని చెబుతున్నారని అనుమానం వ్యక్తం చేస్తుండ్రు.

పట్టించుకునేవారు లేరు



మాకున్న నాలుగెకరాలకు పైగా భూమి రిజర్వాయర్‌లో మునిగిపోతోంది. భూమితో బావి, షెడ్డు అన్నీ పోతున్నాయి. పరిహారం ఇస్తారంటే సంతకాలు చేసినం ఇంతవరకు రాలేదు. రాజకీయ నాయకులకు, అధికారులతో మొర పెట్టుకుంటున్నాం. పట్టించుకునే వారు లేరు.

– నల్ల హన్మంతు, మంగపేట

ఇప్పటి ధర కట్టియ్యాలే



రిజర్వాయర్‌లో భూములు కోల్పోతున్న మాకు ప్రస్తుతం ఉన్న మార్కెట్ ధర కట్టియ్యాలే. అప్పటి ధర కట్టిస్తే ఎకరం పోయినోల్లకు పావు ఎకరం రాదు. భూముల ధరలు బాగా పెరిగాయి. పరిహారం రాకముందే చెరువులు నింపితే భూములు నీట మునుగుతున్నయి.

– బైరి ప్రభాకర్‌రెడ్డి, మంగపేట

పనులు చేయనివ్వం



పరిహారం ఇచ్చేంత వరకు చెరువు కట్ట మరమ్మతు పనులు చేయనివ్వం. ఎన్ని రోజులైనా ఇక్కడే ధర్నా సేత్తం. ఎల్లంపల్లి నీటితో చెరువు నింపితే భూములు మునుగుతున్నాయి. పరిహారం రాకముందే పంట చేన్లు ముంచుతుండ్రు.

– మధురమ్మ, మంగపేట

ఈ -శ్రమ్ కార్డులు సద్వినియోగం చేసుకోవాలి



కార్డులు అందిస్తున్న మున్సిపల్ కమిషనర్

చొప్పదండి: కార్మికులు ఈ–శ్రమ్ కార్డులను సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ శాంతికుమార్ కోరారు. పట్టణంలోని 11వ వార్డులో కౌన్సిలర్ పెరుమాండ్ల మానస ఆధ్వర్యంలో గౌడ సంఘం వద్ద ఈ–శ్రమ్ కార్డులను నమోదు చేసి పంపిణీ చేశారు. ఈసందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. కార్డు నమోదు చేసుకున్నవారికి ప్రమాద బీమా కింద రూ. రెండు లక్షలు, అంగవైకల్యానికి రూ. లక్ష పొందుతారని, భవిష్యత్‌లో సంక్షేమ పథకాలకు ఉపయోగపడుతుందని తెలిపారు. పీఎఫ్ లేని ప్రతి అసంఘటిత కార్మికుడు కార్డు కోసం నమోదు చేసుకోవాలని సూచించారు. ఆయుష్మాన్ భారత్ ద్వారా రూ. 5 లక్షల వరకు వైద్య సదుపాయం పొందవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎండీ అజ్జు, సమత, రేణుక, కేత, సునీత, కుమార్, కనకవ్వ, తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

వీణవంక: మండల కేంద్రానికి చెందిన మోటం వేణు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా ఆయన కుటుంబ సభ్యులను వీణవంక సర్పంచ్ నీల కుమారస్వామి పరామర్శించి మూడువేల ఆర్థిక సాయం అందించారు. గ్రామంలో మృతిచెందిన వారి కుటుంబాలకు అండగా నిలబడుతూ ఆర్థికసాయం చేస్తున్నాడు. వెంట ఉపసర్పంచ్ ఓరెం భానుచందర్, రాయిశెట్టి సంపత్, మోటం రాజు, ఎండీ యాసిన్, ఓరెం క్రాంతి, నీల పున్నం చందర్, కృష్ణచైతన్య, కోరే రవి, యార కుమార్, సంపత్, మోటం సారయ్య తదితరులు ఉన్నారు.

'కంటి వెలుగు' సద్వినియోగం చేసుకోవాలి



జమ్మికుంట: కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు



హుజూరాబాద్: కళ్లద్దాలు అందిస్తున్న బండ శ్రీనివాస్



శంకరపట్నం: కేశవపట్నంలో ఎంపీడీవో..

జమ్మికుంట: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న కంటి వెలుగు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ చైర్మన్ తక్కళ్లపెల్లి రాజేశ్వర్‌రావు అన్నారు. బుధవారం పట్టణంలోని 21వ వార్డులో కంటి వెలుగు శిబిరాన్ని ప్రారంభించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా సీఎం కేసీఆర్ పేదల కోసం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ దేశిని స్వప్నకోటి, కౌన్సిలర్లు రావికంటి రాజు, దయ్యాల శ్రీనివాస్, శ్రీపతినరేష్, వార్డు అధ్యక్షుడు సుదం సత్యం, ప్రజలు పాల్గొన్నారు.

హుజూరాబాద్: కంటి వెలుగు శిబిరాలతో కంటి సమస్యలు దూరమవుతాయని ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ బండ శ్రీనివాస్ అన్నారు. పట్టణంలోని 29వ వార్డులోని గాంధీనగర్‌లో కంటి వెలుగు శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ముందు చూపుతో ప్రవేశ పెట్టిన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. కంటి సమస్యలతో బాధపడుతున్నవారు శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రజలకు పరీక్షలు చేసి కళ్లద్దాలు, అవసరమైన వారికి శస్త్ర చికిత్స చేయిస్తామని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ గందె రాధిక, వైస్ చైర్‌పర్సన్ కొలిపాక నిర్మల, కమిషనర్ సల్వాది సమ్మయ్య, వార్డు కౌన్సిలర్లు ముక్క రమేశ్, రాజేంద్రప్రసాద్, కిషన్, ముత్యంరాజు, పైళ్ల వెంకట్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు విక్రమ్ రెడ్డి, రమేష్, ప్రతాప కృష్ణ, డిప్యూటీ డీఎంహెచ్‌వో చందు, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ సాజిద్, డిస్ట్రిక్ట్ హెల్త్ ఎడ్యుకేటర్ ప్రతాప్, ఆప్తామాలిక్ రఘోత్తం రెడ్డి, చెల్పూర్ పీహెచ్‌సి వైద్యాధికారి శ్యామ్, ఎంపీహెచ్‌వో వెంకటేశ్వర్లు, ఆరోగ్యశాఖ సిబ్బంది ప్రజలు పాల్గొన్నారు.

శంకరపట్నం: మండలంలోని కేశవపట్నం గ్రామ పంచాయతీలో బుధవారం ఎంపీడీవో బషీరొద్దీన్ కళ్లద్దాలు పంపిణీ చేశారు. ఇటీవల కంటివెలుగు శిబిరంలో పరీక్షలు చేసుకున్న వారిలో అవసరం ఉన్నవారికి అందజేశారు. కొత్తగట్టు గ్రామపంచాయతీలో ఎంపీపీ సరోజన కళ్లద్దాలు అందజేశారు. కార్యక్రమంలో వైద్యులు వేణు, సుమన్, ఉపసర్పంచ్ హన్మంతు, బండారి తిరుపతి, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

ఇసుక తవ్వకాలు నిలిపివేయాలి



వీణవంక: వాగు వద్ద దీక్ష చేస్తున్న రైతులు

వీణవంక: మానేరు వాగులో ఇసుక తవ్వకాలను నిలిపివేయాలని కోరుతూ మండలంలోని చల్లూరు, ఇప్పలపల్లి గ్రామాల రైతులు వాగు వద్ద చేపట్టిన దీక్ష రెండో రోజుకు చేరింది. ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా క్వారీల పేరుతో తవ్వకాలు చేపడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నిల్వ చేసిన ఇసుక డంపులను సీజ్ చేయాలని స్థానిక అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఇసుక తవ్వకాల వల్లన భూగర్భ జలాలు అడుగంటి పోతాయని ఆందోళన వ్యక్తం చేశారు. అక్రమ తవ్వకాలను ఆపకుంటే పెద్ద ఎత్తున ఆందోళన చేపడుతామని హెచ్చరించారు. ఈకార్యక్రమంలో ముదిగంటి వెంకట్‌రెడ్డి, గొడుగు వినోద్‌కుమార్, అంజనేయులు, కుమార్, మహేశ్, సంపత్ రైతులు పాల్గొన్నారు.

క్వారీని రద్దు చేయాలి

సైదాపూర్: మండలంలోని ఆకునూర్ ఊరగుట్ట వద్ద నిర్వహిస్తున్న క్వారీని ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలని అదే గ్రామానికి చెందిన బీజేపీ ఆర్టీఐ విభాగం జిల్లా కన్వీనర్ రావుల రాజిరెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం గ్రామ పంచాయతీలో క్వారీ రద్దు చేయాలని ఫిర్యాదు చేశారు. క్వారీ నిర్వాహణతో గ్రామస్తులు, పాఠశాల, రైతులకు తీవ్ర నష్టం జరుగుతుందన్నారు. పంచాయతీ అనుమతి, గ్రామస్తుల నుంచి నో ఆబ్జెక్షన్ లేకుండా అధికారులు అనుమతులు ఇవ్వడం పలు అనుమానాలకు తావిస్తోందన్నారు. క్వారీ నిర్వాహకుల కాసులకు అధికారులు కక్కుర్తి పడటం దారుణమన్నారు. గ్రామస్తులకు నష్టం జరుగుతోందని, ఉన్నతాధికారులు పునఃపరిశీలించి, ఊరగుట్ట క్వారీ అనుమతులు రద్దు చేయాలని వినతి పత్రంలో పేర్కొన్నారు.

'బీఆర్ఎస్‌ను విమర్శించే స్థాయి ఎంఐఎంకు లేదు'


కరీంనగర్: బీఆర్ఎస్‌ను, ఎమ్మెల్యేలను విమర్శిస్తే ఊరుకోబోమని ఆ పార్టీ మైనారిటీ సెల్ నాయకులు హెచ్చరించారు. ఎంఐఎం పట్టణ అధ్యక్షుడు గులాం అహ్మద్ హుస్సేన్ దిష్టిబొమ్మను బుధవారం కరీంనగర్‌లోని తెలంగాణ చౌక్‌లో యూసుఫ్ ఆధ్వర్యంలో దహనం చేశారు. అనంతరం మాట్లాడుతూ.. బీఆర్ఎస్‌ను విమర్శించే స్థాయి ఎంఐఎంకు లేదని, గులాం అహ్మద్ హద్దుమీరి మాట్లాడటం మానుకోవాలన్నారు. కరీంనగర్ పట్టణంలో బీఆర్ఎస్‌పై విమర్శలు చేసి, అధిష్టానం వద్ద మార్కులు కొట్టేయాలని చూస్తున్న గులాం అహ్మద్ తన తీరు మార్చుకోవాలని సూచించారు. లేకపోతే కరీంనగర్‌లో తిరగనివ్వబోమని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు సయ్యద్ అమ్జద్, అక్బర్‌హుస్సేన్, ఫాహద్, మీరజ్ అస్మద్, షౌకత్ అలీ, నవాజ్, నవాజ్ హుస్సేన్, ఇంతియాజ్, మున్నా, నయీమ్, మాజిద్, అఫ్జల్, ఆరిఫ్, సలీం, హసీఫ్, మాజిద్, జమీల్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినికి చేయూత



చొప్పదండి: మండలంలోని ఆర్నకొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆరో తరగతి విద్యార్థిని దీకొండ సాన్విత తండ్రి అనారోగ్యంతో ఇటీవల మృతి చెందాడు. విద్యార్థినికి ఉపాధ్యాయులు, విద్యార్థులు, తెలంగాణ గ్రామీణ బ్యాంకు సిబ్బంది రూ. 15 వేలు సేకరించి సాన్విత పైచదువుల కోసం నగదు మొత్తాన్ని బ్యాంక్‌లో డిపాజిట్ చేశారు.

కౌశిక్‌రెడ్డికి శుభాకాంక్షలు



హుజూరాబాద్: ప్రభుత్వ విప్‌గా బాధ్యతలు స్వీకరించిన ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డిని బుధవారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో హుజూరాబాద్ పీఏసీఎస్ చైర్మన్ ఎడవెల్లి కొండల్‌రెడ్డి, రైతుబంధు సమితి నాయకులు రమణారెడ్డి మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.

విద్యార్థులకు అల్పాహారం



చిగురుమామిడి: అల్పాహారం అందిస్తున్న ఎంపీపీ



మానకొండూర్‌రూరల్: పచ్చునూర్‌లో...

చిగురుమామిడి: మండలంలోని చిన్నముల్కనూర్ ఆదర్శ పాఠశాల పదో తరగతి విద్యార్థులకు బుధవారం ఎంపీపీ కొత్త వినీత అల్పాహారం పంపిణీ చేశారు. ఉదయం, సాయంత్రం వేళ ప్రత్యేక తరగతులకు హాజరవుతున్న దృష్ట్యా ప్రభుత్వం అల్పాహారం అందించడం సంతోషించదగిన విషయమని ఎంపీపీ అన్నారు. పరీక్షలు పూర్తయ్యే వరకు ప్రతిరోజు ఆహారం అందిస్తామన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కె. శ్రీనివాస్, ఎస్ఎంసీ చైర్మన్ పూదరి అరుణ్‌కుమార్, సర్పంచ్ ముప్పిడి వెంకటనర్సింహారెడ్డి, ఉపాధ్యాయులు తదితరులున్నారు.

అక్షర ఫౌండేషన్ ఆధ్వర్యంలో..

చిగురుమామిడి ప్రభుత్వ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థులకు అక్షర ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం జెడ్పీటీసీ గీకురు రవీందర్ అల్పాహారం పంపిణీ చేశారు. జనవరి నుంచి ప్రారంభించిన కార్యక్రమం మార్చి నెలాఖరు వరకు అందిస్తామని చెప్పారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా నాయకుడు పన్యాల శ్యాంసుందర్‌రెడ్డి, రామోజు కృష్ణమాచారి, విద్యాకమిటీ చైర్మన్ చెరుకు రాజయ్య, సింగిల్ విండో డైరెక్టర్ చిటుమల్ల శ్రీనివాస్, ఫౌండేషన్ నిర్వాహకులు బుర్ర శ్రీనివాస్, సర్వర్‌పాషా, గొల్లపల్లి అరుణ, హెచ్ఎం శోభారాణి తదితరులున్నారు.

మానకొండూర్‌రూరల్: మండలంలోని పచ్చునూర్ గ్రామం ప్రభుత్వ పాఠశాలలో బుధవారం విద్యార్థులకు అల్పాహారం అందించామని ఉపాధ్యాయులు తెలిపారు. విద్యార్థులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఉత్తమ ఫలితాలు సాధించాలన్నారు.

విద్యానగర్‌లో సేవాలాల్ విగ్రహం ఆవిష్కరణ



నివాళి అర్పిస్తున్న గిరిజన నాయకులు

కరీంనగర్: గిరిజన సమస్యలపై పోరాటమే సేవాలాల్ మహరాజ్‌కు మనమిచ్చే నిజమైన నివాళి అని గిరిజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బీమా సాహెబ్ అన్నారు. సేవాలాల్ జయంతి ఉత్సవాల్లో భాగంగా బుధవారం విద్యానగర్‌లో సేవాలాల్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఆయన గొప్ప సంఘ సంస్కర్త అని, గిరిజనులు సంచార జీవనం నుంచి స్థిర నివాసాలు ఏర్పాటు చేసుకునేలా హితబోధ చేసిన మహనీయుడని కొనియాడారు. సేవాలాల్ జయంతిని సెలవు దినంగా ప్రకటించాలని డిమాండ్ చేస్తున్నా ప్రభుత్వం ప్రకటించకపోవడం అన్యాయమని అన్నారు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రంలో గిరిజన యూనివర్సిటీ ఏర్పాటు, రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన గిరిజన బంధు పథకాన్ని తక్షణమే అమలు చేయాలన్నారు. 11 బీసీ కులాలను గిరిజన జాబితాలో చేర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానం చేసి, కేంద్రానికి పంపడాన్ని వ్యతిరేకించాలని గిరిజనులకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు బాలా నాయక్, మోతిలాల్, రజనీష్, దేవీలాల్, అజయ్, అనసూయ నాయక్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

దారుస్సలాం చలువతోనే గంగులకు పదవి



మాట్లాడుతున్న ఎంఐఎం నాయకులు

విద్యానగర్: కరీంనగర్ దారుస్సలాం చలువతోనే గంగుల కమలాకర్ గత ఎన్నికల్లో ఎమ్మెల్యేగా గెలిచి, మంత్రి పదవి పొందారని ఎంఐఎం నాయకులు అన్నారు. బుధవారం కరీంనగర్‌లోని ఎంఐఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. రాష్ట్రంలో 50 అసెంబ్లీ స్థానాల్లో పోటీ చేస్తామని ఎంఐఎం శాసనసభాపక్ష నేత అక్బరుద్దీన్ ఓవైసీ చేసిన ప్రకటనతో రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా కరీంనగర్ బీఆర్ఎస్ నేతల్లో అలజడి మొదలైందని పేర్కొన్నారు. ఎంఐఎంను కరీంనగర్‌లో బలోపేతం చేసేందుకు తమ పార్టీ కరీంనగర్ నగర అధ్యక్షుడు సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్ ఆధ్వర్యంలో డివిజన్ సందర్శన కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని తెలిపారు. దీనికి వస్తున్న ప్రజాదరణను చూసి, బీఆర్ఎస్ నాయకులు జీర్ణించుకోలేక పోతున్నారని ఎద్దేవా చేశారు. మంత్రి ఆదేశాల మేరకే వారు గందరగోళం సృష్టిస్తున్నారని ఆరోపించారు. అన్నేమల్ల సురేష్, కల్లేపల్లి బాలరాజు, సాజిద్ మాజిద్, ఎండీ సాజిద్, బెజ్జంకి సుధాకర్, తాండ్ర శంకర్ బాబు, నోమాన్, యాకూబ్, ఆమెర్ ఖురేషి తదితరులున్నారు.

ఆధ్యాత్మికం

ఘనంగా శ్రీసుబ్రహ్మణ్యస్వామి కల్యాణం



స్వామివారి కల్యాణం నిర్వహిస్తున్న వేదపండితులు

జమ్మికుంట: మున్సిపల్ పరిధి అబాది జమ్మికుంట గ్రామంలోని శ్రీ మహాదేవలింగేశ్వరస్వామి దేవాలయంలో శివరాత్రి ఉత్సవాల సందర్భంగా బుధవారం శ్రీవల్లి, దేవసేన సమేత శ్రీ సుబ్రహ్మణ్యస్వామి కల్యాణం కనుల పండువగా నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్చరణల మధ్య స్వామివారి కల్యాణానికి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారికి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, వాసవి వనిత క్లబ్ అధ్యక్షురాలు రమాదేవి, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



పచ్చునూర్‌లో చేతిపంపును ప్రారంభిస్తున్న సర్పంచ్

చేతిపంపు ప్రారంభం

మానకొండూర్‌రూరల్: మండలంలోని ఊటూర్, పచ్చునూర్, శ్రీనివాసనగర్ గ్రామాల్లో బుధవారం ఫాతిమానగర్ అడోరేషన్ సొసైటీ ఆధ్వర్యంలో నాలుగు చేతిపంపులను ప్రారంభించారు. సొసైటీ డైరెక్టర్ సిస్టర్ ప్రీతా మాట్లాడుతూ.. గ్రామాల్లో నీటి ఎద్దడి నివారణకు, ప్రజలకు అందుబాటులో నీటి సౌకర్యం ఏర్పాటు చేస్తున్నామని పేర్కొన్నారు. స్వచ్ఛంద సంస్థ సిబ్బంది, సిస్టర్ దీప్తి, సొసైటీ సభ్యులు మల్లేశం, రూప, స్రవంతి, శ్రీనివాస్‌రెడ్డి, ప్రజలు పాల్గొన్నారు.